# వెనక్కి పోతాన్నేను..!

- తాటిపాముల మృత్యుంజయుడు

ఆగండి!.దయచేసి ఆపండి.!!



ముందుకురుకుతున్న
గోడ గడియారంలోని ముళ్ళని
పట్టుకు తిప్పండి!
వెనక్కి,,ఇంకా వెనక్కి.
రాయలు నాటి స్వర్ణయుగం దాటి
బాబిలోనియా నాగరికత కాలం దాటేసి
మన బంధువు మూలపురుషుడు
ఆది మానవుడు యుగం నాటికి
ఆ కాలానికి వెళ్ళిపోతాన్నేను
అక్కడ హాయిగా జీవిస్తాన్నేను..!
అవసరానికి మించిన కోరికలు లేవతనికి
పగ, దగా పదాలు తెలియవతనికి..
ఈ కంప్యూటర్ అభివృద్ధి వద్దు నాకు
వైర్‌లెస్ వ్యవస్థ అసలే వద్దు!
ఈ లోకం స్వార్థం, కుళ్ళుతో నిండి వుంది..
డబ్బు చుట్టూ శలభంలా తిరుగుతోంది..
బుధ గ్రహానికి పోతే ఏమిటి గొప్ప
సాటి మనిషి కాలే కడుపును
గడ్డి రొట్టెలతో నింపుకొంటున్నప్పుడు!
ఉగ్రవాదాలు, ఏకే 47 లు
ప్రపంచ పటాన్ని రక్తమయం చేస్తున్నప్పుడు..

జీవించడానికి గ్యారంటీ లేనప్పుడు..

నేనిక్కడ

ఇంకొక్క క్షణం నిలవలేను!

మీరే ఈ ధునిక విలాసాల్ని అనుభవించండి..

ప్లీజ్!  గడియారం ముళ్ళను పట్టుకు వేలాడండి..

ముందుకు పోనీయకండి..

కాలాన్ని వెనక్కి తిప్పండి..

ఆది మానవుడ్ని అవుతాన్నేను..!!



(పుట్టి పెరిగింది వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామం .చదివింది ఇంజినీరింగ్ ఉస్మానియా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఫ్ సౌత్ కరోలినా. భార్య, కుమారునితో సిలికాన్ వేలీ మిలిపిటాస్ లో నివాసం. సాఫ్ట్ వేర్ కంపెనీలో ప్రోడక్ట్ మేనేజర్ ఉద్యోగం. కవితలు, కథలు, నాటికలూ వ్రాయడం, నటించడం ప్రవృత్తులు)

# రంగుల కల

*గొర్తి బ్రహ్మానందం*



చిన్నప్పటి నుండి నాతో చెలిమి చేస్తూ..

నాతోపాటే పెరుగుతూ -

నా వాళ్ళందరికీ దూరంగా

కొన్నివేల మైళ్ళు నన్ను

మోసుకొచ్చింది నా అందమైన కల.

ఈ పంచరంగుల ప్రపంచంలో

అవకాశాల అద్దాల మేడలో - నాకోసం ఒక..

అందమైన చోటు చూపించింది-

నాకు డాలరు కోటు తొడిగింది-

నన్ను నిలువెల్లా స్టాకులతో ముంచెత్తింది..

సుఖాల కోటలో,

సదుపాయాల భవంతిలో,

సడిసేయని కారులో నేనూ, నా హంగుల కల..

"హా స్వర్గమంటే ఎక్కడో లేదు-

ఇక్కడే వుంది..!: అని అనుకుంటుండగా...

హఠాత్తుగా-

బిన్‌లాడెన్ భూతం నా కలని హైజాక్ చేస్తే-

పరిగిడుతూ..

నాస్డాక్ సౌధం పైనుండి పడిన

నా ప్రియమైన కల-

కాళ్ళు విరిగి అవిటిదయ్యింది..!

మరో వైపు-

ఇరాకు తైల దెయ్యం పట్టి యుద్ధం ప్రకటిస్తే

అదిరి - విలవిల్లాడింది, నా రంగుల కల..!

ఈ లోగా ఉద్యోగాల బుడగ

బాంబులా పేలితే, బెదిరిపోయి-

నిరుద్యోగపు కానుక నా చేతికిచ్చి

నన్ను ఇక్కడ ఒంటరిగా వదిలి-

ఇక్కడి నౌకరీలను,

తనకి తోడుగా తీసుకుని-

పలాయనం చిత్తగించింది..

నా రంగుల కల తన దేశానికి..!!

(రచయిత పుట్టింది, పెరిగింది- కోనసీమ నడిబొడ్డు అమలాపురం. చదువు- ఎం.టెక్. (అమెరికాకి పనికొచ్చేటంత). ప్రస్తుతం: సన్ మైక్రో సిస్టంస్ లో స్టాఫ్ ఇంజినీర్ ఉద్యోగం వెలగబెడుతున్నట్టు శ్రీమతి గారి ఉవాచ. కుటుంబం: ఏమాట రాసినా పెదవి విరిచే శ్రీమతి, 'భాష రాక బతికిపోయామ' నుకునే ఇద్దరు బుడుగులు. సాహిత్యం: అందరికీ ఐదు ప్రాణాలైతే వీరికి మాత్రం ఏడు - మిగతా రెండూ సంగీతం, సాహిత్యం)